ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి
జిల్లా వార్తలు

ఆదివారం 7 ఏప్రిల్ 2024



వడ్డాది- మాడుగుల రహదారి ఇలా..

నేటి నుంచి నూకాంబిక అమ్మవారి జాతర



అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఆదివారం రాత్రి నుంచి ప్రారంభం కానుంది.

- వార్త 7వ పేజీలో..

రహదారుణం

ఐదేళ్లుగా నరకం

గోతులమయంగా బీఎన్ రోడ్డు

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.130 కోట్లు ఎన్‌డీబీ నిధులు మంజూరు
- వైసీపీ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్‌తో జాప్యం
- ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద మార్జిన్ మనీ నిధులు విడుదల చేయకపోవడంతో ఆలస్యం
- కాంట్రాక్టరుకు బిల్లులు రాకపోవడంతో నిలిచిపోయిన పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని పాలకులు



చోడవరం పట్టణంలోని కొత్తూరు శివారు జంక్షన్ వద్ద న్యామరూపాల్లేని విధంగా ఉన్న తారురోడ్డు

చోడవరం, ఏప్రిల్ 6:

వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రధాన రహదారుల అభివృద్ధిని గాలికొదిలేసింది. కనీసం టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రాజెక్టులను కూడా కొనసాగించలేదు. దీంతో ప్రధాన రహదారులు అధ్వానంగా తయారై వాహనచోదకులకు నరకాన్ని చూపిస్తున్నాయి. దీనికి ఉదాహరణే భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డు దుస్థితి. ఈ రహదారి ఎప్పటికి పూర్తవుతుందో అర్థంకాని పరిస్థితి. దీంతో ఐదేళ్లుగా జనం ఇబ్బందులు పడుతున్నారు.

చోడవరం మండలం గంధవరం నుంచి రోలుగుంట వరకు 45 కిలోమీటర్లు, అలాగే వడ్డాది నుంచి మాడుగుల నియోజకవర్గ పరిధిలోని మాడుగుల-పాడేరు రూటులోని వడ్డాది నుంచి తాటిపర్తి వరకు 15 కిలోమీటర్ల మేర బీఎన్ రోడ్డు విస్తరణకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌డీబీ(న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్) నిధులు రూ.130 కోట్లు మంజూరయ్యాయి. ఇంతలో ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ పనులకు బ్రేక్ పడింది. రివర్స్ టెండర్ల ప్రక్రియతో రహదారి పనులకు ఆదిలోనే జాప్యం జరిగింది. ఆ తరువాత కొంతకాలం కొవిడ్ కారణంగా పనులు ప్రారంభం కాలేదు. ఎన్‌డీబీ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద చెల్లించవలసిన మార్జిన్ మనీ నిధులు విడుదల చేయకపోవడంతో మరికొంతకాలం ఈ పనులు నిలిచిపోయాయి. ఈ పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుండడంతో అధికార పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఆ పార్టీ నాయకులు ఆందోళనకు దిగుతామని హెచ్చరికలు జారీ చేయడంతో చివరకు 2022 నవంబరు నెలలో రోడ్డు పనుల్లో కదలిక వచ్చింది. అయితే బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల మధ్య రెండు, మూడు ప్యాచ్ వర్కులు చేసిన తరువాత ఆ పనులకు బిల్లులు రాకపోవడంతో పనులను సంబంధిత కాంట్రాక్టరు అర్థాంతరంగా నిలిపివేశారు. ఇక అప్పటి నుంచి బీఎన్ రోడ్డు పనుల్లో కదలిక లేకుండాపోయింది. బీఎన్ రోడ్డు పూర్తిగా ఛిద్రంగా మారిపోవడం, చెరువును తలపించేలా ఈ రోడ్డు మారిపోవడంతో తాత్కాలికంగా గుంతలను పూడ్చి ఊరుకున్నారు. ఆ తరువాత చోడవరం పట్టణ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం అంటూ ఒక పావు కిలోమీటరు మేర సీసీ రోడ్డు వేసి మళ్లీ పనులు నిలిపివేశారు. రహదారి మొత్తం ధ్వంసం చేసి వదిలిపెట్టడంతో దుమ్మూధూళితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు డిప్యూటీ సీఎంగా, చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రభుత్వ విప్‌గా కీలక పదవుల్లో ఉన్నా ఈ రోడ్డును పూర్తి చేయించలేకపోయారని ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు.

వడ్డాది- తాటిపర్తి రోడ్డు మరీ అధ్వానం

గంధవరం నుంచి రోలుగుంట వరకు గల బీఎన్ రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంటే, మాడుగుల నియోజకవర్గ పరిధిలోని వడ్డాది నుంచి తాటిపర్తి వరకు గల రహదారి మరీ ఘోరంగా తయారైంది. ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లాలన్నా, అక్కడ నుంచి మైదాన ప్రాంతానికి రావాలన్నా మూడు, నాలుగు గంటల ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో ... మిగతా 8వ పేజీలో

ఐదేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



ఈ రహదారి ఎప్పటికి పూర్తవుతుందో అర్థంకావడం లేదు. ఐదేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది.

- మతం అప్పారావు, కొవ్వూరు, రోలుగుంట మండలం

ఇంట్లోకి దుమ్ము వచ్చేస్తోంది



రహదారి అధ్వానంగా ఉండడం, మా ఇల్లు రోడ్డు పక్కన ఉండడంతో దుమ్మూ, ధూళి వచ్చేస్తోంది. ఈ రోడ్డు గోతులమయంగా ఉండడంతో చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. ఈ రోడ్డు పూర్తయ్యే వరకు మాకు కష్టాలు తప్పవు.

- దొడ్డి అర్జునమ్మ, గర్నికం, రావికమతం మండలం

ఆటో మరమ్మతులకు గురవుతోంది



ఈ రోడ్డంతా గోతులమయంగా ఉండడంతో ఆటో తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఏ గోతిలో ఆటో బోల్తా పడుతుందోననే టెన్షన్ నిత్యం ఉంటోంది. ఒళ్లు కూడా హూనం అవుతోంది. మా కష్టాలు ఎప్పటికి తీరతాయో అర్థం కావడం లేదు.


- గండేపల్లి నూకరాజు, ఆటో డ్రైవర్, ఎం.కోటపాడు, మాడుగుల మండలం



రావికమతం గర్నికం వద్ద ప్రధాన రహదారి పరిస్థితి

నేడు అనకాపల్లిలో పవన్ కల్యాణ్ పర్యటన

- వారాహి వాహనంపై పట్టణంలో రోడ్డు షో



అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం అనకాపల్లి రానున్నారు. సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో అనకాపల్లి డైట్ కళాశాల సమీపంలో గల ఒక ప్రైవేటు లేఅవుట్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రింగ్‌రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహం కూడలి, చేపలబజారు, చిన్న నాలుగురోడ్ల కూడలి, కన్యకాపరమేశ్వరి జంక్షన్, వేల్పుల వీధి మీదుగా నెహ్రూచౌక్ జంక్షన్ వరకూ వారాహి వాహనంలో రోడ్డుషో నిర్వహిస్తారు. నాలుగు గంటలకు నెహ్రూచౌక్ కూడలిలో వారాహి వాహనం మీద నుంచి ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

జగన్‌ను ఇంటికి పంపుదాం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

బలిఘట్టంలో మహిళా మేలుకో కార్యక్రమం



బలిఘట్టం బీసీ కాలనీలో మహిళా మేలుకో కార్యక్రమంలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు, అశేషంగా హాజరైన పార్టీ కార్యకర్తలు, అభిమానులు

నర్సీపట్నం, ఏప్రిల్ 6 :

రాష్ట్ర భవిష్యత్తు కోసం దుర్మార్గుడిని ఇంటికి పంపాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. శనివారం బలిఘట్టం బీసీ కాలనీలో మహిళా మేలుకో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తిహక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇళ్ల స్థలాల పట్టాలు కూడా మహిళల పేరు మీద ఇచ్చారని గుర్తు చేశారు. తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఎందరో మహిళలు ఉన్నత చదువులకు అవకాశం కల్పించారని తెలిపారు.

జగన్‌మోహన్‌రెడ్డి మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి మోసం చేశాడని విమర్శించారు. బ్రాందీ షాపులు తీసేసిన తర్వాతే ఓటు అడగడానికి వస్తానని అన్న మంత్రి రోజా ఇప్పుడు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. మహిళలలో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం ఇచ్చి నాన్న జేబును ఖాళీ చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు ఓట్లు అడగడానికి వస్తే మద్యనిషేధం అమలు చేసిన తర్వాత ఓట్లు కోసం రమ్మని నిలదీయండి అని మహిళలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ స్థానానికి కమలం గుర్తు మీద, ఎమ్మెల్యే స్థానానికి సైకిల్ గుర్తు మీద ఓటు వేయాలని కోరారు. తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ అధ్యక్షురాలు తేజస్వి మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచే కాదు దేశం నుంచి తరిమికొట్టవచ్చునని అన్నారు. చంద్రబాబు మహిళా పక్షపాతి అని కొనియాడారు. ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఒకరికి అమ్మఒడి ఇచ్చి, రెండో పిల్లాడిని కూలికి పొమ్మని జగన్ అంటున్నాడని, చంద్రబాబు సీఎం అయితే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకంలో రూ.15 వేలు చొప్పున అందజేస్తారని తెలిపారు. వృద్ధాప్య, వితంతు పింఛను రూ.3 వేలు నుంచి రూ.4 వేలు చేస్తారని చెప్పారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, విదేశీ విద్య వంటి పథకాలు అమలు చేస్తారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కరెంటు చార్జీలు ఏడు సార్లు పెంచారని తెలిపారు. లేని దిశ చట్టాన్ని ఉందని నమ్మించి మోసం చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న మాట్లాడుతూ ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సెల్ఫీ స్టార్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ నర్సీపట్నం అభివృద్ధికి ఏం వెలగబెట్టాడని ప్రశ్నించారు. సీఎంతో సెల్ఫీలు తప్పితే ఏమీ లేదని ఎద్దేవా చేశారు. అయ్యన్నపాత్రుడు 150 పడకల ఆస్పత్రి తీసుకు వస్తే, ఇప్పుడు టార్చ్‌లైట్లు వెలుతురులో ఆపరేషన్లు చేసే దుస్థితికి తీసుకువచ్చాడని విమర్శించారు. తాండవ గేటుకు రంధ్రం పడితే రూ.7 లక్షలతో మరమ్మతులు చేయించలేకపోయారన్నారు. బస్సు యాత్ర పేరుతో సీఎం ఏసీ బస్సుల్లో తిరుగుతుంటే, చంద్రబాబు మండుటెండలో తిరుగుతున్నాడని జనం మాట్లాడుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికలలో కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, లాలం సాయి ప్రసన్న, అల్లంపల్లి శిరీషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం రమేశ్

నిప్పుల కొలిమి

జిల్లాలో మండుతున్న ఎండలు

- రావికమతంలో 44.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- అనకాపల్లిలో 39.8..
- అల్లాడిపోతున్న జనం



అనకాపల్లిలోని గాంధీనగరానికి వెళ్లే మార్గంలో జన సందడి లేని దృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. శనివారం రావికమతంలో 44.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అనకాపల్లి పట్టణంలో 39.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. శుక్రవారంతో పోలిస్తే అనకాపల్లిలో 1.8 డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత అధికం కావడంతో పాటు పది గంటల నుంచి వడగాడ్పులు కూడా వీయడం వల్ల జనం ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం వేళ ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. సాయంత్రమైనా గాల్లో వేడి తగ్గలేదు. దూర ప్రాంతాల నుంచి వివిధ పనులపై ఇక్కడికి వచ్చిన గ్రామీణ ప్రజలు ఎండ వేడికి విలవిల్లాడారు.

మునగపాకలో భారీగా అక్రమ మద్యం పట్టివేత

- 39,168 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం
- ముగ్గురి అరెస్టు

- వార్త మెయిన్‌లో..



జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, తదితరులు

అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లు, పనులపై సమీక్ష జరిపారు. ఈ సమావేశానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు హాజరై జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్, డీఆర్‌వో దయానిధి, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, డీఎస్‌వో మూర్తి, డీఎంహెచ్‌వో హేమంత్, కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రమేశ్‌కు నోటీసు జారీ

- విధి నిర్వహణలో అధికారులకు ఆటంకం కలిగించారని అభియోగం
- 9న చోడవరంలో విచారణకు హాజరు కావాలి



సీఎం రమేశ్‌కు నోటీసు అందిస్తున్న అనకాపల్లి పోలీసులు

అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు అనకాపల్లి పోలీసులు శనివారం 41ఏ నోటీసు జారీ చేశారు. చోడవరంలో ఈ నెల 4న ఓ టైల్స్ వ్యాపారి ఇంట్లో రాష్ట్ర జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపడుతుండగా, సీఎం రమేశ్ వారిని అడ్డుకొని విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి ఎస్ఆర్‌కే సోమేశ్ ఫిర్యాదు మేరకు చోడవరం పోలీసులు అదే రోజు సీఎం రమేశ్‌పై కేసు నమోదు చేశారు. అధికారులను సీఎం రమేశ్ అడ్డుకున్నారని, వారి చేతుల్లో ఉన్న ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.15
సహరి (సోమ)	4.30

క్రైం... crime news

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మీరాజు (ఫైల్)

సబ్బవరం, ఏప్రిల్ 6 : మండలంలోని జాతీయ రహదారిపై సున్నం బట్టీలు వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎలమంచిలికి చెందిన తీటకాలి లక్ష్మీరాజు(48) పెందుర్తిలోని ప్లైవుడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈయన భార్య, పిల్లలతో పురుషోత్తపురం వద్ద నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం స్వగ్రామానికి బైక్‌పై వెళ్లి తిరిగి రాత్రి పెందుర్తి వెళుతున్నాడు. జాతీయ రహదారి సున్నంబట్టీలు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వాహన చోదకులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య జ్యోతి సంతోషికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమణ తెలిపారు. కాగా లక్ష్మీరాజుకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

590 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్పీ, పోలీస్ సిబ్బంది

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 6: రోలుగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా 590 కిలోల గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా అందిన సమాచారం మేరకు రోలుగుంట పోలీసులు దాడి చేసి రోలుగుంట మండలం ఎం.పెదపేట గ్రామానికి చెందిన కొదమ నాగరాజు, కె.కోటపాడు మండలం ఆర్లి గ్రామానికి చెందిన నంబారు రాజు, రోలుగుంట మండలం వెలమకాయల గ్రామానికి చెందిన కాశీరాజుల వద్ద 590 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.30.4 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసి, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ అక్రమ రవాణాకు ఎక్కడి నుంచి ప్రారంభమైంది.. ఎక్కడకు చేరుతుందన్న అంశంపై లోతుగా దర్యాప్తు ప్రారంభించామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న రోలుగుంట, రావికమతం పోలీసులను ఎస్పీ అభినందించారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 51 పశువుల పట్టివేత

- ముగ్గురు అరెస్టు



అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని సీతారాంపురం జాతీయ రహదారిపై కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 51 పశువులను పట్టుకుని డ్రైవర్, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎస్. జోగారావు తెలిపారు. ముందస్తు అందిన సమాచారం మేరకు సీతారాంపురం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా తుని వైపు వెళుతున్న కంటైనర్‌ను తనిఖీ చేయగా 51 పశువులను పట్టుకున్నామన్నారు. పశువులను వెంకోజీపాలెంలోని గో సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు తెలియజేశారు. డ్రైవర్, మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు.

పెదరాంభద్రపురం హత్య కేసులో మరొకరు అరెస్టు

- అరెస్టు అయిన వ్యక్తి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన వలంటీరు

పాయకరావుపేట, ఏప్రిల్ 6: మండలంలోని పెదరాంభద్రపురంలో ఈ ఏడాది జనవరిలో జరిగిన హత్య కేసులో మరొక వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఈ ఏడాది జనవరి 11వ తేదీన మండలంలోని పెదరాంభద్రపురంలో అదే గ్రామానికి చెందిన సీలి నూకరాజు అనే వ్యక్తి అంబేడ్కర్,జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద కూర్చునే గట్టు మీదకు చెప్పులతో ఎక్కాడు. అలా చెప్పులతో ఎక్కకూడదని అక్కడే ఉన్న గంపల నూకరాజు(బుజ్జి) చెప్పడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం ఒక పథకం ప్రకారం మారణాయుధాలతో జరిగిన దాడిలో తీవ్రగాయాలైన గంపల నూకరాజు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అప్పట్లో 13 మంది నిందితులను అరెస్టు చేశారు. శనివారం మరొక నిందితుడు పాయకరావుపేట రాజీవ్ నగర్ కాలనీకి చెందిన వలంటీరు పెద్దాడ గాంధీని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 : పట్టణంలో 12 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి దర్జీకాలనీకి తీసుకువెళుతున్న కె.దుర్గారావును అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ హెచ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. రింగురోడ్డులో దుర్గారావు వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు లభించాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఖైదీ పరారీ

- వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

విశాఖపట్నం ఏప్రిల్ 6: చికిత్స కోసం కేజీహెచ్‌లో చేర్పించిన ఖైదీ తప్పించుకొని పారిపోయాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి శనివారం వన్‌టౌన్ సీఐ భాస్కర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవుకు చెందిన బొమ్మిడి మహాలక్ష్మి అలియాస్ రాజు (24)పై మూడు కేసుల్లో నేరం రుజువు కావడంతో 2022 జూన్ నుంచి విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. మూడు రోజుల కిందట జైలులో మేకులు, వైర్ ముక్కలు తినడంతో జైలు అధికారులు కేజీహెచ్‌కు తరలించారు. ఇక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి రాజేంద్రప్రసాద్ వార్డులో ఇన్‌పేషెంట్‌గా ఉంచారు. అతడికి శస్త్రచికిత్స చేయాల్సి రావడంతో శుక్రవారం రాత్రి సూపర్ స్పెషాలిటీ వార్డుకు తరలించారు. ఆ సమయంలో వాష్ రూమ్‌కు వెళ్లాలని చెప్పడంతో జైలు గార్డు తీసుకువెళుతుండగా, అతడిని బలవంతంగా తోసి పరారయ్యాడు. హఠాత్పరిణామంతో కంగుతిన్న గార్డు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెల్లడించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

నేటి నుంచి నూకాంబిక కొత్త అమావాస్య జాతర

- నెల రోజులపాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 400 మంది పోలీసులతో రెండు షిఫ్టుల్లో బందోబస్తు



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఆదివారం రాత్రి నుంచి ప్రారంభం కానుంది. నెల రోజులు పాటు జరిగే జాతర సందర్భంగా ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు అమ్మవారికి ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర పర్యవేక్షకురాలు, దేవదాయ శాఖ డీసీ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆది, మంగళ, గురువారాలతోపాటు మిగిలిన రోజుల్లో కూడా ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి, ఖరగ్‌పూర్, బిలాయి ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి కుటుంబసమేతంగా భక్తులు వచ్చి మొక్కుబడులు తీర్చుకుంటారు. భక్తులు ఎండ వేడిన పడకుండా ఉండేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భారీ ఎత్తున క్యూలైన్లు సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి ప్రారంభమయ్యే అమ్మవారి దర్శనం తెల్లవార్లు ఉంటుందని చెబుతున్నారు. ప్రతీయేటా ఫాల్గుణ బహుళ అమావాస్య నుంచి చైత్ర బహుళ అమావాస్య వరకు నెల రోజుల పాటు అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరుపుతారు.

భారీ బందోబస్తు..

నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా ఆలయం వద్ద, పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పట్టణ సీఐ జి. శంకరరావు తెలిపారు. షిఫ్ట్‌కు 200 మంది ఎస్ఐ నుంచి హోంగార్డు వరకు రెండు షిఫ్ట్‌ల్లో 400 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు సిద్ధం చేశామని తెలిపారు.అంతేకాకుండా ముఖ్యమైన కూడళ్ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని, మఫ్టీలో కూడా పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

పార్కింగ్ స్థలాలు..

ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్టు ట్రాఫిక్ సీఐ వి.పైడపునాయుడు తెలిపారు. జాతీయ రహదారి మీదుగా అమ్మవారి ముఖద్వారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే వాహనచోదకులకు జాతీయ రహదారిలోని కొబ్బరితోట, పెట్రోల్‌బంకు పక్కన, పక్కనే ఉన్న మరో కొబ్బరితోటలో వాహనాల పార్కింగ్‌కు సిద్ధం చేశామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఫూల్‌బాగ్ రోడ్డు మీదుగా వచ్చే భక్తులకు భాష్యం స్కూల్ వద్ద, నూకాంబిక ఆలయం సమీపంలోని కొబ్బరితోట, విశాఖ ఫైనాన్స్ భవనం వద్ద పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామన్నారు.

భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా చర్యలు

- ఈవో బండారు ప్రసాద్

జాతర సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేశాం. భక్తులకు స్నానాల గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా తయారుచేసి సిద్ధం చేశాం. క్యూలో ఉన్న భక్తులకు చల్లటి తాగునీరందిస్తాం. అమ్మవారి దర్శనానికి రూ.100లు, రూ.50లు క్యూలైన్లను సిద్ధం చేశాం. 26న మూలవిరాట్ దర్శనం కల్పించేందుకు పనులు వేగవంతం చేస్తున్నాం.



ఆలయంలో ఆవరణలో వేసిన చలువ పందిళ్లు

పదేళ్లలో మోదీ చేసిన అభివృద్ధిని వివరించండి

- బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో అనకాపల్లి పార్లమెంట్ నియోజవర్గం బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్



బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

నర్సీపట్నం, ఏప్రిల్ 6 : పదేళ్ల పాలనలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన దేశాభివృద్ధిని గడప గడపకు వెళ్లి వివరించాలని అనకాపల్లి పార్లమెంట్ నియోజవర్గం బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి ఒక్కడ ఏర్పాటైన బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 264 బూత్ కమిటీలు మండలాల వారీగా విభజించి బీజేపీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక, రాక్షస పాలన పోవాలంటే బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉమ్మడిగా పనిచేయాలని సూచించారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో అవినీతి పాలన సాగుతుందన్నారు. తప్పు జరిగినప్పుడు మాట్లాడాల్సిన అవసరం ఉందని, చాలా మంది కేసులకు భయపడి మాట్లాడడం లేదని వాపోయారు. రాష్ట్రానికి జరుగుతున్న నష్టాన్ని వివరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మద్యం దుకాణాల మీద అప్పు తెచ్చిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే అని ఎద్దేశా చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, దేశం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన పాకలపాటి అరవింద్ కుమార్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ నాయకులు వెలగా జనార్థన్, కాళ్ళ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ సమావేశం జరుగుతున్న కృష్ణా పేలస్ గదిలో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. మీటింగ్‌లో చీరలు పంపిణీ చేస్తున్నారని అందిన సమాచారంతో ఎన్నికల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా తొమ్మిది పాత చీరలు కవర్లలో చుట్టి లభించాయి. మహిళలు బీజేపీ గుర్తుతో ఉన్న చీరలు ధరించి పాత చీరలు గదిలో వదిలేసి ఉంటారని భావిస్తున్నారు. సమావేశం కోసం అనుమతి తీసుకున్న వెలగా జగన్నాథ్‌కు నోటీసు ఇచ్చి వివరణ తీసుకుంటామని రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. దీనిపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, సీఎం రమేశ్ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమం పాడు చేయడానికే ఎవరో ఫిర్యాదు చేస్తే అధికారులు తనిఖీలు చేయడానికి వచ్చారన్నారు.

18 నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

- ఏర్పాట్లపై ఈఓ శ్రీనివాసమూర్తి సమావేశం



సిబ్బందితో సమావేశమైన ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, ఏప్రిల్ 6 : వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఈనెల 18న అంకురార్పణతో ప్రారంభం కానున్నట్టు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో తిరు కల్యాణ మహోత్సవాలతో పాటు మే 10న జరిగే స్వామివారి నిజరూప దర్శనం నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన శ్రీసుదర్శన నారసింహ మహా యజ్ఞం విజయవంతం కావడంతో అదే స్ఫూర్తితో ఈనెల 18 నుంచి 24 వరకు జరిగే తిరు కల్యాణోత్సవాలను కూడా విజయవంతం చేయాలని చెప్పారు. ముఖ్యంగా భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం, ఆలయ పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. అలాగే ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసరాలకు అందుబాటులో అంబులెన్స్‌లు, పారామెడికల్ సిబ్బంది, మందులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైదికపరంగా జరగాల్సిన ఎదుర్కోలు ఉత్సవం, రథోత్సవం, కల్యాణ వేదిక ఏర్పాటు, కల్యాణం నిర్వహణ, రథసారధికి ఆహ్వానం, విద్యుత్ దీపాలంకరణ, దాతలకు ఆహ్వాన పత్రికలు పంపడం వంటి అనేక అంశాలపై ఈఓ అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో దేవాలయం స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు వెంకట రమణాచార్యులు, ఏఈఓలు నక్క ఆనందకుమార్, పాలూరి నరసింగరావు, నరసింహరాజు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలతో ఎండుతున్న రిజర్వాయర్లు

- ఏడారిని తలపిస్తున్న ఊటగెడ్డ రిజర్వాయర్
- ఆందోళన చెందుతున్న రైతులు



వేసవి ఆరంభంలోనే ఎండిపోయిన మామిడిపాలెం రిజర్వాయర్

మాకవరపాలెం, ఏప్రిల్ 6 : ఎండలు మండిపోతున్నాయి. వేసవి పూర్తిస్థాయిలో ఆరంభం కాకముందే భానుడు ప్రతాపాన్ని చూపుతున్నారు. సాగునీటి వనరులు సైతం కొన్నిచోట్ల ఎండిపోతున్నాయి. ఇప్పటికే మండలంలోని చినరాచపల్లి గ్రామంలో ఉన్న ఊటగెడ్డ రిజర్వాయర్ ఎండిపోయింది. ఈ ప్రాంత రైతులు, పశువులకు వేసవిలో ఈ రిజర్వాయర్ నీరు ఎంతో ఉపయోగపడేది. గత ఏడాది రిజర్వాయర్ గెట్లు మరమ్మతుకు గురి కావడంతో ప్రస్తుతం చుక్క నీరు లేకుండా పోయిందని చెపుతున్నారు. అలాగే మామిడిపాలెం రిజర్వాయర్‌లో పూడికతీత పనులు చేపట్టక పోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీరు వచ్చినట్టే బయటకు పోవడంతో రిజర్వాయర్‌లో చుక్కనీరు కనిపించని దుస్థితి నెలకొంది. వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఏమిటని రైతులంతా ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం ముందుగా స్పందించి రిజర్వాయర్ గేట్లను బాగుచేయించి, పూడిక తీయిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు పేర్కొంటున్నారు.



ఊటగెడ్డ రిజర్వాయర్ దుస్థితి

పింఛన్‌దారుల మృతి ప్రభుత్వ వైఫల్యమే

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



విలేకరులతో మాట్లాడుతున్న బాబ్జీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 : రాష్ట్ర ప్రభుత్వ పాలనా వైఫల్యం కారణంగానే రాష్ట్రంలోని 33 మంది పింఛన్‌దారులు కన్నుమూశారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను పక్కదోవ పట్టించి సీఎస్ జవహర్ రెడ్డి ముఖ్యమంత్రికి అనుకూలంగా వ్యవహరించారన్నారు. పింఛన్‌దారులను కావాలనే కిలోమీటరు దూరం నడిపించారనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయన్నారు. సీఎస్ ప్రజల పక్షాన ఆలోచించకపోవడం విచారకరమన్నారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రత బయట ఉంటే వృద్ధులు సచివాలయాలకు ఎలా వెళ్లగలుగుతారని ప్రశ్నించారు. సచివాలయాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చిన రూ. ఎనిమిది వేల కోట్లను మళ్లించిన ప్రభుత్వంపై పంచాయతీరాజ్ సమాఖ్య నేటికి పోరాడుతున్నదన్నారు. వచ్చే మే నెల ఒకటి, రెండు తేదీల నాటికి సీఎస్ పింఛన్‌దారుల ఇంటికి పింఛన్లు అందించే ఏర్పాట్లు చేయలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు కొలసాని రమణ, రైతు ప్రతినిధి పెంటకోట వరప్రసాద్, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

రోలుగుంట, ఏప్రిల్ 6: మండలంలోని కుసర్ల పూడి గ్రామానికి చెందిన గొల్లు ఎర్రమ్మ (70) వడ దెబ్బకు గురై మృతిచెందినట్టు ఆయన కుటుంబ సభ్యులు, వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ మద్దు అప్పలనాయుడు తెలిపారు. వారు అందించిన వివరాల ప్రకారం...ఎర్రమ్మ శుక్రవారం పెన్షన్ తీసుకోవడానికి సచివాలయానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ఎండ వేడికి తట్టుకోలేక కళ్లు తిరిగి పడిపోయారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వెంటనే ఇంటికి తీసుకువెళ్లి సపర్యలు చేశారు. శనివారం ఇంటి వద్దనే స్థానిక వైద్యుడు వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. చికిత్సపొందుతూ మృతిచెందారు. ఎర్రమ్మకు భార్య కొండమ్మ, కుమారుడు రాజుబాబు ఉన్నారు. రాజుబాబు పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు.

రూ.2.8 లక్షల నగదు సీజ్

విశాఖపట్నం, ఏప్రిల్ 6: చినవాల్తేరు మెంటల్ ఆసుపత్రి రోడ్డులో శనివారం రాత్రి ఓ మహిళ కారులో రూ.2,80,500 నగదుతో ప్రయాణిస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్, త్రీ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. కణితి స్పందన ప్రఫూర్ణ యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆమె రాత్రి కారులో నగదుతో వెళ్తున్నారు. విషయం తెలుసుకున్న స్క్వాడ్ మెంటల్ ఆసుపత్రి రోడ్డులో కారు నిలిపి తనిఖీ చేయగా నగదు లభ్యమైంది. నగదుకు సంబంధించి ఆమె ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. చినవాల్తేరు ఓల్డ్ సీబీఐ రోడ్డులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

మాకవరపాలెం, ఏప్రిల్ 6: జిల్లాలో వలంటీర్ల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. మాకవర పాలెం మండలంలో మాకవరపాలెం, జి.కోడూరు, జిగంగవరం సచివాలయాలకు చెందిన 40 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో చంద్రరావుకి అందజేసి ఆమోదించాలని కోరారు.

గొలుగొండ మండలంలో..

గొలుగొండ: మండలంలోని పలు సచివాల యాలకు చెందిన 69 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. మండలంలోని కృష్ణాదేవిపేటలో 10 మంది, ఏఎల్.పురం గ్రామంలో 13 మంది, రావణాపల్లి, కొమిర గ్రామాల్లో 16 మంది, జోగంపేటలో 13 మంది, చిన్నయ్యపాలెంలో ఐదుగురు, జోగంపేటలో 12 మంది ఆయా గ్రామ కార్యదర్శులకు రాజీనామా పత్రాలు అందజేశారు.

జైతవరంలో ఆరుగురు..

చీడికాడ: మండలంలోని జైతవరం గ్రామానికి చెందిన ఆరుగురు గ్రామ వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు.

మాసాహెబ్‌పేటలో 16 మంది..

పాయకరావుపేట రూరల్: మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామానికి చెందిన 16 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో కె.స్వప్నకు అందజేశారు.

నిప్పులు చెరిగిన భానుడు


మండల కేంద్రంలో ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

సబ్బవరం, ఏప్రిల్ 6 : మండలంలో శనివారం భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. శనివారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో పాదచారులు, వాహన చోదకులు ఎండ ధాటికి తీవ్ర అవస్థలు పడ్డారు. రైతులు వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తీవ్ర వడగాడ్పులకు చిన్నారులు, వృద్ధులు అవస్థలు ఎదుర్కొన్నారు.

కొత్త అమావాస్య జాతరకు నూకాంబిక ఆలయం ముస్తాబు



ఎలమంచిలి, ఏప్రిల్ 6 : కొత్త అమావాస్య జాతర పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలోని నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద దాత బొద్దపు నాగు దంపతులు అందజేసిన ప్రధాన ద్వారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదే విధంగా భక్తుల ఆర్థిక సాయంతో నిర్మించిన ఆర్చీ ఆకట్టుకుంటుంది. వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాకారం, ప్రధాన వీధులను విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు.

పరిహారం ఇవ్వకుండా పనులు చేయకండి

▸▸ ఏపీఐఐసీ అధికారులకు రైతుల స్పష్టీకరణ

నక్కపల్లి, ఏప్రిల్ 6: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములకు పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలని రైతులు స్పష్టం చేశారు. మండలంలోని చందనాడ గ్రామ పరిసరాల్లో కారిడార్ భూముల్లో యంత్రాలతో పనులు చేయించేందుకు ఏపీఐఐసీ సిబ్బంది వచ్చారు. ఈ గ్రామ పరిధిలో దళితులు సాగులో వున్న 54 ఎకరాల భూములకు ఇంకా పరిహారం ఇవ్వలేదని, తక్షణమే వారికి న్యాయం చేయాలని రైతు సంఘం ప్రతినిధులు గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్ నేతృత్వంలో పలువురు డిమాండ్ చేశారు. పనులు చేయకూడదని అడ్డుకున్నారు. దీంతో ఏపీఐఐసీ సిబ్బంది యంత్రాలతో వెనక్కి వెళ్లిపోయారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

▸▸ జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల


మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 6 : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. శనివారం కొత్తూరు నరసింగరావుపేటలో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ తొలగించిన పేదల పింఛన్‌లను పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలియజేస్తున్న పారిశుధ్య కార్మికులు

తుమ్మపాల, ఏప్రిల్ 6 : తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం తుమ్మపాల పంచాయతీ కార్యాలయం దగ్గర పారిశుధ్య కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. కార్మికులకు అవసరమైన మెటీరియల్‌ను పంచాయతీ నుంచి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ శిబిరం

తుమ్మపాల, ఏప్రిల్ 6: భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఈనెల 26 నుంచి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నామని సంస్థ డైరెక్టర్ బి. విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులు పాటు టూ వీలర్ మెకానిక్, హౌస్ వైరింగ్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు సెల్‌నంబరు 8008333509ను సంప్రదించాలని కోరారు.

తాకాశివీధి నూకాంబిక గరగల మహోత్సవం


గరగలతో ఊరేగుతున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 : స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి గరగల మహోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి భక్తులు తలపై గరగలు పెట్టుకుని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో తాకాశి రాజేష్, తాకాశి కన్నబాబు, తాకాశి చందు, వీధి పెద్దలు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయ అభివృద్ధి రూ.60 వేలు విరాళం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 6: మండలంలోని గోకులపాడు నూకాలమ్మ ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన అద్దేపల్లి వీరాస్వామి రూ. 60 వేలనగదును విరాళంగా అందజేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మొత్తంతో అమ్మవారి ఆలయం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఆలయం వెలుపల చదును చేయించడం జరిగిందన్నారు. వీరాస్వామిని గ్రామస్థులు అభినందించారు.

సీఎం రమేశ్‌కు నోటీసు జారీ

... 5వ పేజీ తరువాయి

ఫైళ్లను లాక్కొనేందుకు ప్రయత్నించారనే అభియోగాలను మోపారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడ్డుకున్నందుకు ఆయనపై ఐపీసీ 353, 342, 506, 201, 143,149 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అనకాపల్లి సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఎస్.అప్పలరాజు పేరుతో శనివారం నోటీసు జారీ చేశారు. అనకాపల్లిలో సీఎం రమేశ్ నివాసానికి వెళ్లి పోలీసులు నోటీసు అందజేశారు. ఈ నెల 9న చోడవరం పోలీస్ స్టేషన్‌లో జరగబోయే విచారణకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోగా హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

ఉపమాక వెంకన్న క్షేత్రానికి తగ్గని భక్తుల రద్దీ

నక్కపల్లి, ఏప్రిల్ 6: మండలంలోని ఉపమాక క్షేత్రంలో శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు ముగిసినప్పటికీ కల్యాణ వేంకటేశ్వరుడిని దర్శించుకోవడం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు ఉపమాక తరలివస్తున్నారు. శనివారంనాడు వేలాది మంది భక్తులు ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. క్యూ లైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తుల గోత్రనామాలతో ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.





ఆర్‌అండ్‌బీ స్థలంలో దుకాణాల నిర్మాణం

▸▸ రాత్రికి రాత్రే షెడ్డు ఏర్పాటు

▸▸ అధికారుల అండతోనే నిర్మాణమని స్థానికుల ఆరోపణ


ప్రభుత్వ స్థలంలో దుకాణాల నిర్మాణం పూర్తి చేసిన దృశ్యం

కొత్తూరు, ఏప్రిల్ 6 : అనకాపల్లి మండలం కొత్తూరు మేజర్ పంచాయతీలో ఆర్‌అండ్‌బీ స్థలంలో చేపడుతున్న దుకాణాల నిర్మాణం అధికారుల సహకారంతో పూర్తయిందని స్థానికులు ఆరోపించారు. ప్రధాన రహదారిలో దర్జాగా దుకాణాలు నిర్మించినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుకాణాల నిర్మాణంలో భారీగా ముడుపులు ముట్టాయని వారు ఆరోపిస్తున్నారు. వీటిని తొలగించకుంటే తాము కూడా ఖాళీ ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడతామని స్థానికులు తేల్చిచెబుతున్నారు. ఇదే విషయమై స్థానికులు పంచాయతీ కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రభును వివరణ కోరగా.. దుకాణాలు అక్రమంగా నిర్మించారనేది వాస్తవమేనని చెప్పారు. వాటిని తొలగించాలని తహసీల్దార్‌కు, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశానని బదులిచ్చారు.

కూటమి ప్రభుత్వంలో పెన్షనర్లకు ఇబ్బందులు ఉండవు : బుద్ద


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు

అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నెలకు రూ.4 వేలు ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడం గొప్ప విషయమన్నారు. ఎన్నికల్లో పెన్షనర్లను అడ్డం పెట్టుకొని వైసీపీ లబ్ధి పొందాలని రాజకీయాలు చేస్తోందన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ అధికారంలోకి రాగానే పెన్షన్‌లు పంపిణీ ఇంటి వద్దే జరుగుతుందన్నారు. వలంటీర్లను వైసీపీ పార్టీ కార్యకర్తలుగా వాడుకోవడం వల్లే ఎన్నికల కమిషన్ వారి సేవలను నిలుపుదల చేసిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కోట్ని బాలాజీ, కర్రి గోపి, సత్యనారాయణ, వెంకటరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీసీ సుజాత

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 : స్థానిక నూకాంబిక అమ్మవారి జాతర ఏర్పాట్లను శనివారం జాతర ప్రత్యేక అధికారిణి, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత పరిశీలించారు. భక్తులకు ఇచ్చే ప్రసాదాలను పరిశీలించారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, క్యూలైన్‌లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఈమె వెంట ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీసీ సుజాత →



డంపింగ్ యార్డులకు తరలించిన వ్యర్థాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్టు

సబ్బవరం, ఏప్రిల్ 6 : మండలంలోని పలు గ్రామాల్లో డంప్ చేసిన వ్యర్థాలను ఆయా గ్రామ పంచాయతీ సిబ్బంది డంపింగ్ యార్డులకు తరలించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'గ్రామాల్లో దుర్గంధం' కథనానికి అధికారులు స్పందించారు. సబ్బవరం-చోడవరం రోడ్డులోని చెత్త, వంగలిలో సాగునీటి చెరువులో, సబ్బవరం, పెదగొల్లలపాలెం, బంగారమ్మపాలెం, బోదివలస, గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, అసకపల్లి తదితర గ్రామాల్లో రోడ్డు పక్కల, సాగునీటి కాలువల్లో డంప్ చేసిన చెత్తను పంచాయతీ సిబ్బంది డంపింగ్ యార్డులకు తరలించారు. గొల్లలపాలెం సంపద తయారీ కేంద్రంలోని పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు.


సబ్బవరం-చోడవరం రోడ్డులో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సీఎం రమేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నేతలు

రాంబిల్లి, ఏప్రిల్ 6 : బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను శనివారం అనకాపల్లి పార్టీ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, రాంబిల్లి మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎరిపిల్లి అజయ్, పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పలు ప్రధాన సమస్యలను సీఎం రమేశ్‌కు తెలియజేసి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరినట్టు ఆయన తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ టీడీపీ నేతలకు సూచించారు.


సీఎం రమేశ్‌తో టీడీపీ నేతలు

అధ్వానంగా నునపర్తి-వాడచీపురుపల్లి రోడ్డు


శిథిలమైన నునపర్తి-వాడ చీపురుపల్లి రోడ్డు

అచ్యుతాపురం, ఏప్రిల్ 6: మండలంలోని నునపర్తి-వాడచీపురుపల్లి రోడ్డు అధ్వానంగా తయారైంది. అడుగడుగున గోతులమయమై రాకపోకలకు ప్రతిబంధకంగా మారింది. తారురోడ్డు ఆనవాలు లేకుండా గోతులు పడ్డాయి. కొన్నిచోట్ల తారురోడ్డు కేవలం కాలిబాట వలే మాత్రమే మిగిలింది. ఈ రోడ్డు వేసి పుష్కరం గడిచింది. ఇంతవరకు కనీసం ఒక్కసారి కూడా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఈరోడ్డు రూపే మారిపోయింది. తారురోడ్డు అంటే నమ్మలేని పరిస్థితిలో ప్రస్తుతం ఉంది. పరవాడ వద్ద గల ఎన్‌టీపీసీకి నునపర్తి నుంచి ఇదే ప్రధాన రహదారి. అలాగే ఏ వస్తువు కావాలన్నా ఈ ప్రాంతానికి చెందిన వారంతా వాడచీపురుపల్లి వెళ్లాల్సిందే. నునపర్తి చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలు ఈరోడ్డు గుండానే ప్రతిరోజు ప్రయాణం సాగిస్తారు. అయినా ఈ రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు పరిశీలన జరిపి ఈరోడ్డు గురించి పట్టించుకోవాలని ఈప్రాంతీయులు కోరుతున్నారు.

కోటవురట్లలో 98.89 శాతం పింఛన్లు పంపిణీ

కోటవురట్ల, ఏప్రిల్ 6: మండలంలో 98.89 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో కాశీవిశ్వనాథం తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 9,685 మంది పింఛన్‌దారులుండగా ఇప్పటివరకు 9,578 మందికి పంపిణీ చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఇళ్ల వద్దే పింఛన్లు అందజేసినట్టు చెప్పారు.

మొక్కుబడిగా మండల సమావేశం

కోటవురట్ల, ఏప్రిల్ 6: ఎన్నికల కోడ్ కారణంగా శనివారం మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా ముగిసింది. స్థానిక మండలపరిషత్ సమావేశపు హాలులో శనివారం ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యుల హాజరు నమోదును అధికారులు తీసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సర్వసభ్య సమావేశం ఎటువంటి చర్చ జరగకుండా ఎంపీడీవో కాశీవిశ్వనాథం సమావేశం ముగించివేశారు. ఈ సమావేశంలో పెట్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య విభాగంపై పర్యవేక్షణ కరువు?

ఎలమంచిలి, ఏప్రిల్ 6: ప్రజారోగ్యాన్ని పరిరక్షించే పారిశుధ్య విభాగంపై మునిసిపల్ అధికారులు, పాలకుల పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉండడంతో చెత్త బిన్‌లు గ్యారేజీకే పరిమితమయ్యాయి. ప్రజలకు ఉపయోగపడే పారిశుధ్య పరికరాలతో గ్యారేజీ నిండిపోతున్నది. కాలం చెల్లిన పరికరాలు, వాహనాలు మాత్రమే రావాల్సిన గ్యారేజీలో ప్రజలకు ఉపయోగపడే పరికరాలు దర్శనమిస్తున్నాయంటే అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసి పట్టణ వీధుల్లో ఏర్పాటు చేయాల్సిన చెత్త వేసే ట్విన్ బిన్స్ గ్యారేజీలో పడి ఉన్నాయి. వీటి నిర్వహణ పట్ల పర్యవేక్షణ చేయకపోవడంతో ప్రధాన వీధుల్లో ప్రజలు ఉపయోగించాల్సిన ట్విన్ బిన్స్ నిరుపయోగంగా ఉన్నాయి. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రజాధనం వెచ్చిస్తున్న అధికారులు వాటి నిర్వహణ పట్ల శ్రద్ధ కనబరచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


పారిశుధ్య గ్యారేజీలో ఉన్న చెత్త బిన్‌లు

ఆరు నెలలుగా తాగునీరు వృథా

పరవాడ, ఏప్రిల్ 6: స్థానిక మండల పరిషత్ కూడలి సమీపంలో ఏపీఐఐసీకి చెందిన పైపులైన్‌కు లీకేజి ఏర్పడడంతో తాగునీరు వృథా పోతున్నది. పరవాడ జెఎన్ ఫార్మాసిటీ నుంచి అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఉన్న పరిశ్రమలకు తాగునీటి అవసరాల కోసం పదేళ్ల క్రితం పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కూడలి సమీపంలోని పైపులైన్ దెబ్బతిని ఆరు నెలలుగా నీరు పెద్ద ఎత్తున రహదారిపై ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోయారని స్థానికులు మండిపడుతున్నారు. వేసవిలో పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోవడం దారుణమన్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి పైపులైన్‌కు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


పైపులైన్ నుంచి బయటకు వస్తున్న నీరు

రహ'దారుణం'

... 5వ పేజీ తరువాయి

ఈ పనుల ఊసే ఎత్తడం లేదు. ఎన్నికలు జరిగి, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ఈ రహదారికి మోక్షం లేదని ఈ ప్రాంతవాసులు చర్చించుకుంటున్నారు.

నిత్యం ట్రాఫిక్ కష్టాలు

ఈ రహదారి పరిస్థితి ఇలా ఉంటే, ఈ రోడ్డులోని బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వద్ద వంతెన కూలిపోవడం, మరో ఆరు నెలల వ్యవధిలో విజయరామరాజుపేట వద్ద మరో వంతెన, వడ్డాది రావికమతం మధ్య మరో కల్వర్టు వరుసగా కూలిపోయాయి. దీంతో ఈ రోడ్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ కష్టాలకు కొనసాగింపుగా బీ ఎన్ రోడ్డులోని ఇరుకు కల్వర్టుల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు.

రోడ్డెక్కాలంటే భయం



రోడ్డు బాగోలేకపోవడంతో రోడ్డెక్కాలంటే భయమేస్తోంది. రోడ్డంతా గుంతలతో పాటు దుమ్మూ ధూళి కంట్లో పడి రోడ్డు మీద తిరగలేకపోతున్నాం. ఆటో లేదా బస్సు ఎక్కినా గోతుల్లో పడి నడుము విరిగిపోతున్నంత బాధ కలుగుతున్నది. రోడ్డు పరిస్థితికి భయపడి బండి బయటకు తీయడం లేదు.

- సయ్యపురెడ్డి రామన్నదొర, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం

ఎటువంటి ఆధారాలు లేని రూ.73,500 పట్టివేత

సబ్బవరం, ఏప్రిల్ 6 : జాతీయ రహదారి మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.73,500 నగదును ఎస్ఎస్ టీమ్(స్టాస్టికల్ సర్వేలెన్స్) పట్టుకొని సీజ్ చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసి ఎస్ఎస్ టీమ్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లికి చెందిన ఐస్‌క్రీమ్ వ్యాపారి బొలేరో వాహనం పెందుర్తి నుంచి అనకాపల్లి వెళుతుందన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.73,500 నగదు దొరికిందన్నారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని, ఆధారాలు చూపించి నగదును తీసుకెళ్లవచ్చునని సీఐ రమణ తెలిపారు.

వైసీపీ నుంచి 50 మంది జనసేనలో చేరిక

కొత్తూరు, ఏప్రిల్ 6: పట్టణంలోని పాత 16వ వార్డుకు చెందిన 50 మంది యువకులు వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి చేరారు. శనివారం వీరంతా జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో పత్తివాడ భాస్కరరావు మిత్రమండలికి చెందిన యువకులందరికీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి విజయానికి కృషి చేస్తామని వారు చెప్పారు.

జైభారత్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా కనిశెట్టి



అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 : జైభారత్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పట్టణానికి చెందిన కనిశెట్టి సురేష్‌బాబు పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. పార్టీ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణ ఈ మేరకు ప్రకటన చేశారని సురేష్‌బాబు తెలిపారు.

వైభవంగా సింహాద్రప్పన్న ప్రార్థనా కార్యక్రమం

పరవాడ, ఏప్రిల్ 6 : వాడచీపురుపల్లిలో శనివారం వియ్యపు వారి సేవా గరిడి ఆధ్వర్యంలో సింహాద్రిఅప్పన్న ప్రార్థనా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా నక్కవానిపాలెం, బొట్టవానిపాలెం, వాడ్రాపల్లి, దేవాడ గ్రామాలకు చెందిన తోడపెద్దు సేవ (గరిడి) నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు వియ్యపు అప్పలరాజు, ఉరుకూటి అప్పలనరసింహం, సారిపల్లి నేస్తాలు పాల్గొన్నారు.

దేవదాయ శాఖలో పదోన్నతులపై విచారణ జరిపించాలి

▸▸ జిల్లా అధికారిణి కోరిన డీవైఎఫ్ఐ


జిల్లా అధికారిణి సుధారాణికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 : దేవదాయ శాఖలో ఇటీవల ఇచ్చిన పదోన్నతులపై సమగ్ర విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. శివాజీ, పి.చలపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అనకాపల్లి జిల్లా దేవదాయ శాఖ అధికారిణి సుధారాణికి వినతిపత్రం అందజేశారు. విచారణలో భాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐనవిల్లి ఆలయ ఈవో సత్యనారాయణరాజును సస్పెండ్ చేయాలని కోరారు. అక్రమ పదోన్నతుల వ్యవహారంపై ఒక కమిటీ వేసి నిజనిజాలను బయటపెట్టాలని కోరినట్టు శివాజీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా పదోన్నతులు కల్పించారన్నారు. వీటిపై విచారణ జరిపించాలని కోరినట్టు ఆయన తెలిపారు.

సబ్బవరం నేతలను కలిసిన పంచకర్ల

సబ్బవరం, ఏప్రిల్ 6 : జనసేన పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం రాత్రి, శనివారం మండలంలో పర్యటించారు. పలు గ్రామాల్లోని ముఖ్య నేతలను కలసి, వారి అనుచరులను పరిచయం చేసుకుంటున్నారు. గొటివాడలో టీడీపీ సీనియర్ నాయకులు బొండా సత్యరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వడిసల రమేశ్, సబ్బవరం-4 ఎంపీటీసీ సభ్యుడు గొర్లి చైతన్య, నాయకులు కొత్తూరు గడ్డప్ప, బర్ల రమణ, అమృతపురంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు గండి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ గండి దేముడు, అసకపల్లిలో మాజీ ఎంపీపీ ముమ్మన కన్నయ్య, వారి వారి అనుచరులను కలిసి పంచకర్ల పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో నేతలు ఇందలి వెంకటరమణ, గండి దుర్గాప్రసాద్, బీపీ రావు, బంతికోళ్ల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అనిత ఎన్నికల ప్రచారం


బంగారమ్మపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న అనిత

ఎస్.రాయవరం, ఏప్రిల్ 6: మండలంలో టీడీపీ పాయకరావు పేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత శనివారం బంగారమ్మపాలెం, గుడివాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బంగారమ్మపాలెంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జితో కలిసి అనిత ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం గుడివాడలో అనిత ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యేజెర్ల వినోద్‌రాజు, ఎస్. వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు మాధవ్, పలువురు నేతలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

▸▸ జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు


మురకాడలో ప్రచారం చేస్తున్న సుందరపు విజయకుమార్

రాంబిల్లి, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ కోరారు. శనివారం ఆయన మండలంలోని మురకాడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసిందన్నారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన రాంబిల్లి మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, ఉరిటి నానాజీ, అచ్చిబాబు పాల్గొన్నారు.

యోగా శిక్షణ ప్రారంభం

నక్కపల్లి, ఏప్రిల్ 6: నక్కపల్లి-అడ్డరోడ్డు హైవేకు ఆనుకుని వేద డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణను శనివారం ఉదయం నుంచి ప్రారంభించారు. యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం వల్ల మనసు ప్రశాంతంగా వుండడమే గాకుండా, చక్కని ఆరోగ్యం కలుగుతుందని అకాడమీ డైరెక్టర్ నాగేంద్ర చెప్పారు.

వైసీపీ గెలుపే లక్ష్యం కావాలి : సుబ్బారెడ్డి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6: జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రింగురోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కూటమి అభ్యర్థులను ఓడించాలన్నారు. సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని పెంటకోటలో శనివారం రాంభద్రపురం కొత్తూరు, పెంటకోట గ్రామాలకు చెందిన పలువురు జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

పాయకరావుపేటలో.. పట్టణంలోని పార్టీ నూతన కార్యాలయాన్ని రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం పట్టణంలో ఎన్నికల ప్రచారం చేశారు. అంతకుముందు బైక్ ర్యాలీ నిర్వహించారు.

అనువైన చోట పోలింగ్ కేంద్రం

- ఏడు ఆదివాసీ గ్రామాల ప్రజలు డిమాండ్
- అజయ్‌పురంలో ధర్నా
- జెడ్.జోగుంపేటలో ఏర్పాటు చేయాలని నినాదాలు



జెడ్.జోగుంపేటలో పోలింగ్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

రావికమతం, ఏప్రిల్ 6 : ఎనిమిది ఆదివాసీ గ్రామాలకు కూడలిగా ఉన్న జెడ్.జోగుంపేటలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఏడు ఆదివాసీ గ్రామాలకు చెందిన పలువురు గిరిజనులు శనివారం అజయ్‌పురంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ చీమలపాడు పంచాయతీ పరిధిలో పంథొమ్మిది గిరిజన శివారు గ్రామాలున్నాయన్నారు. వీటిలో ఉన్న ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పది నుంచి పద్నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న చీమలపాడు, ములకాలపల్లి పోలింగ్ బూత్‌లకు కొండల్లోని రాళ్లు, రప్పలు దాటు కుంటూ వెళ్లి వేటు వేయాల్సి వస్తుందన్నారు. ఇన్ని అవస్థలు పడలేక కొందరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు దూరంగా ఉంటున్నారని వివరించారు. మూడు కిలో మీటర్ల వ్యవధిలో పాఠశాల భవనం, తాగునీరు, విద్యుత్, మరుగు దొడ్లు, రహదారి, నెట్‌వర్క్ వంటి సౌకర్యం ఉన్న చోట పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ నిబంధనలుగా పేర్కొన్నారు. ఇవన్నీ ఉన్న జెడ్.జోగుంపేట గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే ఆయా గిరిజనులు ఓటు వేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. జెడ్.జోగుంపేటకు మూడు కిలో మీటర్ల దూరంలో రాయిపాడు, పెదగరువు, అజయ్‌పురం, రొచ్చుపణుకు, నేరేడుబంద, కడగెడ్డ, బంగారు బందల, తాటిపర్తి ఆదివాసీ గ్రామాలకు చెందిన 800 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరందరికీ జెడ్.జోగుంపేటలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాంగి చంద్రయ్య, వంతల విజయ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాత మల్లంపేటలో సరుగుడు తోట దగ్ధం

- షార్టు సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు పడడంతో ప్రమాదం



దగ్ధమవుతున్న సరుగుడు తోట

గొలుగొండ, ఏప్రిల్ 6 : మండలంలోని పాతమల్లంపేటలో గుడివాడ స్వామినాయుడుకు చెందిన మూడు ఎకరాల్లో సరుగుడు తోట శనివారం దగ్ధమైంది. విద్యుత్ లైన్ కింద ఈ తోట ఉండడంతో షార్టు సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వకు కిందపడ్డాయి. అప్పటికే కింద ఎండి ఉన్న ఆకులకు అవి తాకడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బందికి అక్కడివారు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల మేర నష్టం జరిగినట్టు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాల్సిందిగా బాధిత రైతు కోరుతున్నాడు

కూటమి ప్రభుత్వంలో పెన్షనర్లకు కష్టాలుండవు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు

అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నెలకు రూ.4 వేలు ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడం గొప్ప విషయమన్నారు. ఎన్నికల్లో పెన్షనర్లను అడ్డం పెట్టుకొని వైసీపీ లబ్ధి పొందాలని రాజకీయాలు చేస్తోందన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ అధికారంలోకి రాగానే పెన్షన్‌లు పంపిణీ ఇంటి వద్దే జరుగుతుందన్నారు. వలంటీర్లను వైసీపీ పార్టీ కార్యకర్తలుగా వాడుకోవడం వల్లే ఎన్నికల కమిషన్ వారి సేవలను నిలుపుదల చేసిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కోట్ని బాలాజీ, కర్రి గోపి, సత్యనారాయణ, వెంకటరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రమేశ్‌కు నోటీసు జారీ

... 5వ పేజీ తరువాయి

ఫైళ్లను లాక్కొనేందుకు ప్రయత్నించారనే అభియోగాలను మోపారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడ్డుకున్నందుకు ఆయనపై ఐపీసీ 353, 342, 506, 201, 143,149 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అనకాపల్లి సబ్ డివిజినల్ పోలీసు అధికారి ఎస్.అప్పలరాజు పేరుతో శనివారం నోటీసు జారీ చేశారు. అనకాపల్లిలో సీఎం రమేశ్ నివాసానికి వెళ్లి పోలీసులు నోటీసు అందజేశారు. ఈ నెల 9న చోడవరం పోలీస్ స్టేషన్‌లో జరగబోయే విచారణకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోగా హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

రహ'దారుణం'

... 5వ పేజీ తరువాయి

ఈ పనుల ఊసే ఎత్తడం లేదు. ఎన్నికలు జరిగి, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ఈ రహదారికి మోక్షం లేదని ఈ ప్రాంతవాసులు చర్చించుకుంటున్నారు.

నిత్యం ట్రాఫిక్ కష్టాలు

ఈ రహదారి పరిస్థితి ఇలా ఉంటే, ఈ రోడ్డులోని బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వద్ద వంతెన కూలిపోవడం, మరో ఆరు నెలల వ్యవధిలో విజయరామరాజుపేట వద్ద మరో వంతెన, వడ్డాది రావికమతం మధ్య మరో కల్వర్టు వరుసగా కూలిపోయాయి. దీంతో ఈ రోడ్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ కష్టాలకు కొనసాగింపుగా బీ ఎన్ రోడ్డులోని ఇరుకు కల్వర్టుల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు.

రోడ్డెక్కాలంటే భయం



రోడ్డు బాగోలేకపోవడంతో రోడ్డెక్కాలంటే భయమేస్తోంది. రోడ్డంతా గుంతలతో పాటు దుమ్మూ ధూళి కంట్లో పడి రోడ్డు మీద తిరగలేకపోతున్నాం. ఆటో లేదా బస్సు ఎక్కినా గోతుల్లో పడి నడుము విరిగిపోతున్నంత బాధ కలుగుతున్నది. రోడ్డు పరిస్థితికి భయపడి బండి బయటకు తీయడం లేదు.


- సయ్యపురెడ్డి రామున్నదొర, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం

నీలగిరి.. అక్రమార్కులకు సిరి..!

- పెదమికొండ రిజర్వు ఫారెస్టులో మాయమవుతున్న చెట్లు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వీఎస్ఎస్ సభ్యులు



చెట్టును నరుక్కుపోవడంతో మిగిలిన మోడు



పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో గాంధీనగరం వీఎస్ఎస్ సభ్యులు పెంచిన నీలగిరి చెట్లు



నాతవరం, ఏప్రిల్ 6 : కష్టం ఒకరిది.. ప్రతిఫలం మరొకరిది అనే నానుడిని అక్రమార్కులు బాగా వంటపట్టించుకున్నారు. అందుకే ఎక్కడైనా ఏపుగా పెరిగిన చెట్టు కనిపించినా.. గెడ్డలు, నదుల్లో ఇసుకను చూసినా.. ఇలా ఏది వారికంట పడినా కాజేస్తుంటారు. అందునా ప్రభుత్వ ఆస్తులైతే రెక్కలు కట్టుకుని మరీ వాలిపోతుంటారు. వీరిని కట్టడి చేయాల్సిన అధికారులు కళ్లకు గంతలు కట్టుకుంటుండడంతో మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటివారే రెండు దశాబ్దాలకు పైబడి వన సంరక్షణ సమితి సభ్యులు పెంచుకున్న చెట్లను గుట్టుగా నరుక్కునిపోతూ జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని పెడిమికొండ రిజర్వుఫారెస్టులో నీలగిరి (యూకలిప్టస్) చెట్లు మాయమవుతున్నాయి. 2001లో అటవీ శాఖ అధికారులు ఈ మొక్కలను సరఫరా చేయగా, అప్పటి వన సంరక్షణ సమితి చైర్మన్ కొత నూకరాజు ఆధ్వర్యంలో వన సంరక్షణ సమితి సభ్యులు 25 ఎకరాలలో వీటిని నాటారు. ఇవి పెద్ద చెట్లుగా పెరిగిన తర్వాత నరికి ఆ కలప విక్రయించగా వచ్చిన ఆదాయంలో సగం అటవీ శాఖకు, సగం గాంధీనగరం గ్రామాభివృద్ధికి వినియోగించాలని అప్పట్లో ఒప్పందం కుదిరినట్టు గ్రామస్థులు చెపుతున్నారు. ప్రస్తుతం ఇవి ఏపుగా పెరిగాయి. ఇదిలావుంటే, అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా ఈ తోటలో చెట్లను అక్రమార్కులు అక్కడక్కడా నరుక్కుని తరలించుకుపోతున్నారు. నాతవరం మండలం తుని- నర్సీపట్నం రూట్‌లో గాంధీనగరం దగ్గర ఈ నీలగిరి తోటలు ఉండగా చివరిలో చెట్లను కొందరు గుట్టుగా నరుక్కుని పోతున్నట్టు పలువురు చెపుతున్నారు. అయినప్పటికీ అటవీ శాఖ అధికారుల్లో చలనం లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి ఈ చెట్లను నరికించేందుకు టెండర్లను ఆహ్వానించాలని, వాటిని విక్రయించగా వచ్చిన ఆ ఆదాయంలో సగం అటవీశాఖకు, మిగిలిన సగం గాంధీనగరం గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. మరీ ఆలస్యం చేస్తే మరిన్ని చెట్లను అక్రమార్కులు నరుక్కుని పోవడం ఖాయమని అంటున్నారు. ఈ అంశాన్ని నాతవరం మండల అటవీ శాఖాధికారి మహేష్ వద్ద ప్రస్తావించగా, నిబంధనల మేరకు టెండర్లను ఆహ్వానిస్తామన్నారు.

గ్రామాల్లో నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు

- కొత్త అమావాస్యను పురస్కరించుకుని నిర్వహణ
- పలు గ్రామాల్లో జిల్లా స్థాయి పోటీలు



మాడుగులలో కొలువుదీరిన అమ్మ



దేవరాపల్లి: ఎం.అలమండలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయం

మాడుగుల, ఏప్రిల్ 6 : మండల కేంద్రం మాడుగుల శివారు నూకాలమ్మ కాలనీలో సోమవారం నూకాలమ్మ జాతర జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట, కాశీపురం, కొత్తపల్లి, ఎం.అలమండ, దేవరాపల్లి గ్రామాల్లో నూకాలమ్మ జాతరకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆది, సోమవారాలు రెండు రోజుల పాటు ఈ వేడుక జరగనుంది. ఈ సందర్భంగా కొత్త అమావాస్య రోజు ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నారు.

బుచ్చెయ్యపేట : కేపీ అగ్రహారంలో నూకాంబిక జాతరను ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. తొలిరోజు సాయంత్రం తప్పెటగుళ్ల, కోలాటం ప్రదర్శనలు ఉం టాయన్నారు. కొత్త అమావాస్య రోజున జిల్లా స్థాయి ఎడ్లపరుగు పందెం నిర్వహించనున్నట్టు చెప్పారు.

చీడికాడ : కొత్త అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో నూకాలమ్మ పండగను నిర్వహించనున్నామని ఆయా ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపడుతున్నట్టు చెప్పారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చినగోగాడ, తంగుడుబిల్లి తదితర గ్రామాల్లో మధ్యాహ్నం అన్నసమారాధనలు జరపనున్నారు.

ముమ్మరంగా పోలీసులు తనిఖీలు



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 6 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాహన తనిఖీలను పోలీసులు విస్తృతం చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, మద్యం, సారా వంటివి తరలించకుండా ఉండేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఘాట్‌రోడ్డు జంక్షన్ వద్ద పోలీసు సిబ్బంది ఈ తనిఖీలు జరుపుతున్నారు. మైదాన ప్రాంతం నుంచి మన్యానికి, మన్యం నుంచి మైదాన ప్రాంతానికి రాకపోకలు సాగించాలంటే ఘాట్‌రోడ్డు జంక్షన్ మీదుగానే వెళ్లాలి. ఈ నేపథ్యంలో ఎస్.దామోదర నాయుడు సారథ్యంలో ఇక్కడ ఈ తనిఖీలు చేపడుతున్నారు.

'రాత్రి వేళ విద్యుత్ కోతలతో జనం అవస్థలు'

రోలుగుంట, ఏప్రిల్ 6 : బ్రేక్ డౌన్ పేరుతో గత రెండు మూడు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి తొమ్మిది గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తుండడం అన్యాయమని సీపీఎం నాయకుడు కె.గోవిందరావు అన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెపుతూ వస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. విద్యుత్ చార్జీలను తీవ్రంగా పెంచి పేదల నడ్డి విరుస్తున్న పాలకులకు వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. రాత్రి వేళ విద్యుత్ కోతల కారణంగా ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.

చంద్రబాబుతోనే సమర్థవంతమైన పాలన

- మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు



పైలా ప్రసాదరావును సత్కరిస్తున్న స్థానిక నాయకులు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 6 : రాష్ట్రం అభివృద్ధి చేయాలి, ప్రజల కష్టాలు తీర్చాలి అన్నదే కూటమి పార్టీల లక్ష్యమని మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని కింతలి, కింతలి వల్లాపురం, పొంగలిపాక, అవురువాడ, జాలంపల్లి, జమ్మాదేవిపేట గ్రామాల్లో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి మంచి పాలన అందించాలంటే సమర్థుడైన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అద్దిపల్లి జగ్గారావు, ఉందూరు దేముడు, పుప్పాల రమేశ్, మైచర్ల సన్యాశిరావు, రాజు, రాజ్‌కుమార్, కొండబాబు, రామకృష్ణ, అచ్యుతరావులతో పాటు జనసేన, బీజేపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



డి.యర్రవరం సభలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

'టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి'

నాతవరం, ఏప్రిల్ 6 : గ్రామాల్లో ఎక్కడ చూసినా గత టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధే కనిపిస్తుంది తప్ప, వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. ఎన్నికల శం ఖారావంలో భాగంగా మండలంలోని డి.యర్రవరం జరిగిన సభలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశన మైందన్నారు. ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు. టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి, మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ, నాయకులు నందిపల్లి వెంకటరమణ, లాలం అచ్చిరాజు, పారుపల్లి కొండబాబు, ఎస్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో జనం బెంబేలు





నిర్మానుష్యంగా ఉన్న నర్సీపట్నం మండలంలోని చెట్టుపల్లి మెయిన్ సెంటర్

నర్సీపట్నం అర్బన్/మాడుగుల, ఏప్రిల్ 6 : వేసవి ఆరంభంలోనే భానుడు భగభగ మండుతున్నాడు. గత నాలుగైదు రోజులుగా ఉదయం తొమ్మిది గంటల నుంచే వేడి వాతావరణం ప్రారంభమవుతోంది. దీంతో జనం బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు చాలా చోట్ల రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నర్సీపట్నంతో పాటు ఇదే మండలం చెట్టుపల్లి, ధర్మసాగరం, కేఎల్‌పురం, వేములపూడి, అమలాపురం, మెట్టపాలెం, మాడుగుల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రోడ్లపైకి వచ్చిన పలువురు పురుషులు, మహిళలు తలపై తువ్వాళ్లు, చీరచెంగులు కప్పుకుని రావడం కనిపించింది. వాహనాలపై వెళ్లేవారు హెల్మెట్ ధరించి ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలునిర్దేశించిన పనులను త్వరగా ముగించుకుని ఇళ్లకు చేరుతున్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



అడ్డసరంలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్న వైద్యుడు

రోలుగుంట, ఏప్రిల్ 6 : మండలంలోని అడ్డసరం, దిబ్బలపాలెం, ఎం.కె.పట్నం, బీబీపట్నంలలో శనివారం హోమీ బాబా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు తరుణ్ ప్రసాద్, మన్సి చాంద్వీనీల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో 80 మంది రోగులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపారు. రొమ్ము క్యాన్సర్, గర్భసంచి క్యాన్సర్, నోటి క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జగ్రత్తలతో పాటు వచ్చిన తరువాత తీసుకోవాల్సిన వైద్యం గురించి వివరించారు. ముఖ్యంగా పోగాకు సంబంధించి ఉత్పత్తులు చుట్ట, బీడీ, సిగరెట్, ఖైనీ, పాన్‌పరాగ్, గుట్కా తదితరాల వల్ల నోటి క్యాన్సర్, గర్భసంచి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. వీటిని అంతా దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట, బుచ్చెంపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు ధనలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



బుచ్చెయ్యపేటలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట/కె.కోటపాడు, ఏప్రిల్ 6 : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం బుచ్చెయ్యపేటలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సీతా నాగరాజు జెండాను ఆవిష్కరించి, దేశాభివృద్ధికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ముక్కా దేముడుబాబు, ఉపాధ్యక్షుడు సేనాపతి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కె.కోటపాడులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కొటాన ఈశ్వరరావు, నాయకులు బండారు సత్యనారాయణపాత్రుడు, సూరిశెట్టి దాసు, సిరపరపు శివస్వామినాయుడు,కొమార అప్పారావు, రాపేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కె.కోటపాడులో జెండా ఆవిష్కరణ దృశ్యం

26 నుంచి జిల్లాలో నిరుద్యోగ యువతకు శిక్షణ

తుమ్మపాల, ఏప్రిల్ 6: భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఈనెల 26 నుంచి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నామని సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులు పాటు టూ వీలర్ మెకానిక్, హౌస్ వైరింగ్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు సెల్‌నంబరు 8008333509ను సంప్రదించాలని కోరారు.

ఆధారాలు లేని రూ.73,500 సీజ్

సబ్బవరం,ఏప్రిల్ 6 : జాతీయ రహదారి మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.73,500 నగదును ఎస్ఎస్ టీమ్(స్టాస్టికల్ సర్వేలెన్స్) పట్టుకొని సీజ్ చేసిట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసి ఎస్ఎస్ టీమ్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లికి చెందిన ఐస్‌క్రీమ్ వ్యాపారి బొలేరో వాహనం పెందుర్తి నుంచి అనకాపల్లి వెళుతుందన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.73,500 నగదు దొరికిందన్నారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని, ఆధారాలు చూపించి నగదును తీసుకెళ్లవచ్చునని సీఐ రమణ తెలిపారు.